క్లుప్తంగా

వైఎస్ రాజారెడ్డికి భూమన నివాళి



నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: వైఎస్ రాజారెడ్డి వర్ధంతి సందర్భంగా శుక్రవారం పులివెందులలోని వైఎస్ రాజారెడ్డి ఘాట్ వద్ద చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి గజమాలలతో ఘన నివాళులర్పించారు.

ఎక్స్ అఫిషియో సభ్యుడిగా దివాకర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం



దివాకర్ రెడ్డి దంపతులకు లడ్డు ప్రసాదాలు అందజేస్తున్న అదనపు ఈఓ వెంకయ్య చౌదరి

తిరుమల: టీటీడీ ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి శుక్రవారం శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి చెంత ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికారు. అనంతరం టీటీడీ అదనపు ఈఓ సీహెచ్.వెంకయ్య చౌదరి శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, బోర్డు సెల్ డిప్యూటీ ఈఓ ప్రశాంతి, వీజీఓ సురేంద్ర పాల్గొన్నారు.

వెండి దీప స్తంభం సమర్పణ



చంద్రగిరి: తిరుచానూరు పద్మావతి అమ్మవారికి తిరుపతికి చెందిన రామకృష్ణ రూ.95 వేల విలువైన 710 గ్రాముల వెండి దీప స్తంభాన్ని శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ఏఈవో దేవరాజులుకు అందజేశారు. వారికి అమ్మవారి ప్రత్యేక దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికి తీర్థప్రసాదాలతో సత్కరించారు.

పేదలకు జేసీఐ అన్నదానం

తిరుపతి కల్చరల్: జేసీఐ తిరుపతి శాఖ శుక్రవారం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేసింది. ప్రణీత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రణీత్ హాజరై అన్నదానం ప్రారంభించి మాట్లాడారు. జేసీఐ ఇండియా అంతర్జాతీయ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఎన్‌బీ.హర్షవర్ధన్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ కమిటీ సభ్యులు జీఎల్.మనోహర్, ప్రవర సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు కె. శ్రీనివాసరావు, జేఏసీ జోన్ వైస్ చైర్మన్ జి.శంకర్, జేసీఐ తిరుపతి శాఖ ఉపాధ్యక్షురాలు మునిలక్ష్మి, కోశాధికారి ఎన్.దిలీప్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

నవోదయలో 'విశ్వం' ప్రతిభ



తిరుపతి ఎడ్యుకేషన్ : జాతీయ స్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయాల్లో 11వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు ఆర్.మనీషా, కె.ముని రూపేష్, ఎ.సంతోష్ పరాశర్, ఎస్.లాస్య చరిత, జె.పూర్ణ సాయిరెడ్డి, రామ్ తేజ, హరిత, లోకేశ్వరి, భావన, కావ్య సీట్లు సాధించారు. వీరితో పాటు 6, 9 తరగతి ఫలితాల్లో విక్రమ్, గోపిక, జీవన్ సాయిరెడ్డి, శరత్‌చంద్ర, నవదీప్ యాదవ్, జాహ్నవి, జస్వంత్, మిథున్ మిహాల్, నితీష్ సాయి, సోహినీ, అబ్యుదయ, సోహిత్‌తో పాటు మొత్తం 47 మంది విద్యార్థులు సీట్లు సాధించినట్లు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. అనంతరం విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథ్ అభినందించారు.

స్వామీ..! పుష్కరిణి చూడవేమి?

తిరుపతి నగర నడిబొడ్డున ఉన్న గోవిందరాజస్వామి ఆలయ పుష్కరిణి ప్రైవేటు వాహనాల అడ్డగోలు పార్కింగ్ వల్ల కనుమరుగు అవుతోంది. ఏకంగా పుష్కరిణి ప్రహరీకే ట్యాక్సీ స్టాండ్ పేరిట బోర్డు పెట్టారు! కోనేరుకు నలు వైపులా ఉన్న ఫుట్‌పాత్ (నడకదారి) సైతం ఆక్రమణకు గురైంది. తూర్పు వైపు ఉన్న (విష్ణునివాసం ఎదురుగా) ఫుట్‌పాత్ ధ్వంసం కావడంతో పరిసరాలు అపవిత్రంగా మారి యాత్రికుల పాలిట శాపంగా మారింది.

- అష్ట దిగ్బంధంలో గోవిందరాజస్వామి ఆలయ పుష్కరిణి
- చుట్టూ ప్రైవేటు వాహనాల పార్కింగ్‌తో కనుమరుగు
- పరిసరాలు అపవిత్రం..యాత్రికుల పాలిట శాపం
- పట్టించుకోని టీటీడీ అధికార యంత్రాంగం



వాహనాల పార్కింగ్ గా మారిన గోవిందరాజు స్వామి పుష్కరిణి

తిరుపతి అన్నమయ్యసర్కిల్: శ్రీవారి దర్శనార్థం బస్సులు, రైళ్లు, ఇతరత్రా వాహనాల్లో సుదూర ప్రాంతాల నుంచి నిత్యం లక్షలాది మంది యాత్రికులు తిరుపతికి వస్తుంటారు. రైల్వేస్టేషన్ సమీపంలోనే గోవిందరాజస్వామి ఆలయం, విశాలమైన గోవింద పుష్కరిణి ఉంది. కొన్నేళ్ల క్రితం వరకు యాత్రికులు ఇక్కడ కాసేపు సేదదీరి ఆ తర్వాత ఆలయాల సందర్శనకు భక్తిభావంతో వెళ్లేవారు. అయితే ఈ పుష్కరిణికి నలువైపులా అద్దెకు సంబంధించిన కార్లు, జీపులు, మినీ వ్యాన్లతో పాటు ఆటోలు, మోటారుసైకిళ్లు ఇబ్బడి ముబ్బడిగా పార్కింగ్ చేస్తుండడంతో ఈ పరిస్థితి కనుమరుగై పుష్కరిణి కళతప్పింది. గతంలో యాత్రికులతో సందడిగా ఉండే ఈ ప్రాంతం క్రమేణా పార్కింగ్ వాహనాలు కమ్మేయడంతో ప్రస్తుతం పుష్కరిణి బోసిపోయింది.

దుర్గంధభరితంగా పరిసరాలు

పుష్కరిణి పరిసరాలు దుర్గంధ భరితంగా మారాయి. కోనేరు గట్టుపై ఉన్న నడకదారికి నలు వైపులా ప్రైవేటు వాహనాల పార్కింగ్, అడ్డగోలుగా రాకపోకలతో పవిత్ర భావం లేకుండా పోతోంది. ఇక, రాత్రి సమయాల్లో ఆకతాయిల ఆగడాలు, మరోవైపు మందుబాబుల వెకిలిచేష్టలు, మరికొందరి వాహన చోదకుల ఓవరాక్షన్ యాత్రికులను ఆందోళన, ఆవేదనకు గురిచేస్తున్నాయి. పుష్కరిణికి పడమర వైపు ఉన్న ముఖద్వారం పగటిపూట మూసివేయడం, పైపెచ్చు ముఖ ద్వారం ముందే వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో యాత్రికులు లోనికి వెళ్లలేని పరిస్థితి. ఇక సాయంత్రం నామమాత్రంగా ముఖద్వారం తెరవడం, హరికథ కాలక్షేపం ముగియగానే మూసివేయడంతో యాత్రికులు, భక్తులు ఉస్సూరంటూ వెనుదిరగాల్సి వస్తోంది.





పుష్కరిణి ప్రహరీకి టాక్సీస్టాండ్ పేరిట పెట్టిన బోర్డు , నోపార్కింగ్ బోర్డు ఉన్నా ఇక్కడ ఇంతే..,



అపచారం: గోవిందరాజు స్వామి పుష్కరిణి వద్ద తాగి పడేసిన మద్యం బాటిళ్లు

ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు

గోవింద పుష్కరిణి గట్టు చుట్టూ ఉన్న ఫుట్‌పాత్ (నడకదారి) ఆక్రమణల తొలగించడానికి చర్యలు తీసుకోవాలని టీటీడీ ఇంజినీరింగ్ విభాగం అధికారులను కోరాం. వారు పుష్కరిణిని పరిశీలించి నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటారు. యాత్రికులకు ఎలాంటి అంతరాయం లేకుండా పుష్కరిణి సందర్శనకు ప్రత్యేక దృష్టి సారిస్తాం.

-వీఆర్ శాంతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, గోవిందరాజస్వామి ఆలయం

నోటీస్ బోర్డు

- ఉదయం 4.45 గంటలకు గోవిందరాజస్వామి తిరుమాడ వీధులలో నగర సంకీర్తన
- తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం
- సీపీఎల్ క్రికెట్ సీజన్1 ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లో భాగంగా ఎస్వీయూ మైదానంలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఆదిత్య లెవెన్స్ వర్సెస్ రాయల్ చాలెంజ్ జట్లు, మధ్యాహ్నం 2 నుంచి హైపీరియన్ వర్సెస్ స్పార్టన్ వారియర్స్ మ్యాచ్.
- యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చేతి రాత, చెస్, స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ
- యూత్ హాస్టల్‌లో సాయంత్రం 5 గంటలకు 'ఏకుదారం' పుస్తకావిష్కరణ సభ

29 నుంచి మహాభారత యజ్ఞం

- పాకాల : మొగరాలలో ఈ నెల 29 నుంచి 49వ మహాభారత ఉత్సవాలు ప్రారంభమవుతాయని ద్రౌపది అమ్మవారి ఆలయ ధర్మకర్త తులసీరామ్‌రెడ్డి తెలిపారు. 28న గెరిగ ఊరేగింపు, 29 నుంచి జూన్ 15వ తేదీ వరకు పగలు హరికథా కాలక్షేపం, జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు రాత్రి నాటకాలు నిర్వహిస్తామన్నారు

ఎక్సైజ్ స్పెషల్ డ్రైవ్

చంద్రగిరి: చంద్రగిరి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలు సమయపాలన పాటించాలని ఎక్సైజ్ సీఐ ఫణీంద్ర తెలిపారు. ఆయన గురువారం రాత్రి తన సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రగిరి ఎక్సైజ్ పరిధిలో 17 మద్యం దుకాణాలు, ఒక బారు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు మాత్రమే మద్యం విక్రయించాలన్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు

తిరుపతి మంగళం: తిరుమల నగర్ గ్రామ పంచాయతీలో ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు భూ ఆక్రమణకు యత్నించి వేసిన ఫెన్సింగ్‌ను శుక్రవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. చెన్నాయిగుంట గ్రామ లెక్క దాఖలా సర్వే నంబర్ 226లో 5.30 సెంట్ల భూమి ఉంది. దీనిలో కొంత స్థలంలో ఆక్రమణదారులు కూసాలు నాటి ఆక్రమణకు యత్నించారు. సమాచారం అందుకున్న తిరుపతి అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి స్పందించారు. ఆమె ఆదేశాలతో వీఆర్వో ప్రసాద్, వీఆర్ఏలు నందా, సిద్ధయ్య అక్కడికి వెళ్లి ఆ కూసాలను పగలగొట్టి తొలగించారు.

చిత్తూరువాసి తిరుపతిలో కిడ్నాప్

తిరుపతి క్రైమ్: చిత్తూరులో నివాసం ఉంటున్న వ్యక్తిని తిరుపతిలో కిడ్నాప్ చేసిన సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. ఎస్వీ యూనివర్సిటీ పోలీసుల కథనం మేరకు, పూతలపట్టు మండలం వావిల్‌తోట పంచాయతీకి చెందిన సత్యనారాయణ కుమారుడు సాగర్ బెంగళూరులోని వ్యాపారవేత్త విజయ శేఖర్ వద్ద ఉద్యోగం చేస్తున్నాడు. అయితే విజయ శేఖర్‌ని సాగర్ మోసం చేసి కనిపించకుండా వెళ్లిపోయాడు. దీంతో సాగర్ తండ్రి సత్యనారాయణను బెంగళూరుకు పిలిపించారు. ఆయన్ను అక్కడి నుంచి కొట్టుకుంటూ కారులో తిరుపతికి తీసుకొచ్చి అపార్ట్‌మెంట్లో మూడు రోజులుగా బంధించారు. తుపాకీతో బెదిరించి 15 చెక్కులపై సత్యనారాయణ వద్ద సంతకాలు పెట్టించుకున్నారు. అనంతరం వారి సొంత ఊరికి తీసుకెళ్లి ఇంట్లో ఉన్న దస్తావేజులు లాక్కొని తిరిగి అతన్ని తిరుపతికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో సత్యనారాయణ తప్పించుకొని చిత్తూరులోని కలెక్టర్ ఆఫీస్ వద్దకు చేరుకున్నాడు. అక్కడి నుంచి డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో యూనివర్సిటీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిద్ధయ్యకు నివాళి



సిద్ధయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

పాకాల : మండలంలోని గాదంకి పంచాయతీ గుడివారిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నేత గిరి పెదనాన్న సిద్ధయ్య గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి శుక్రవారం గ్రామానికి చేరుకున్నారు. సిద్ధయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నంగ నరేష్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ శ్యామలగోపి, రెడ్డెప్పరెడ్డి, రుకేష్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కృష్ణయ్య, చొక్కలింగం, రమేష్, రాజేష్, గిరిధర్ పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలని 2న ధర్నా



ధర్నా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నేతలు

తిరుపతి కల్చరల్: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ జూన్ 2వ తేదీన తహసీల్దార్ కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున నిర్వహించ తలపెట్టిన ధర్నాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ధర్నా పోస్టర్లను ఆయన ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. నిరుపేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి పట్టాలు ఇస్తామని, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేస్తామని, అలాగే సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ హామీలను విస్మరించిందని విమర్శించారు. ఇటీవల పెద్ద ఎత్తున ఆందోళన చేసినా కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని, పార్టీ అధిష్టానం పిలుపు మేరకు మరోసారి నిర్వహించనున్న ధర్నాలలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, నాయకులు ఉదయ్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్‌డీ.రవి, రామకృష్ణ, సీహెచ్.శివకుమార శ్రీనివాసులు, వెంకటేష్, బాల పాల్గొన్నారు.

మహానాడు జూమ్‌లో నిర్వహించాలి



మాట్లాడుతున్న చెంగల్‌రెడ్డి

తిరుపతి రూరల్ : కోవిడ్ విస్తరిస్తున్న నేపథ్యంలో టీడీపీ మహానాడును జూమ్ పద్ధతిలో నిర్వహించాలని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం చంద్రగిరి నియోజకవర్గ అధ్యక్షుడు చెంగల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం తుమ్మలగుంట పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కోవిడ్ నిబంధనలు పాటించాలని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇప్పటికే ఏపీలో 2 కేసులు నమోదయ్యాయని తెలిపారు. మహానాడు నిర్వహిస్తున్న జిల్లాలోనూ కోవిడ్ కేసు నమోదైనట్టు గుర్తు చేశారు. జూన్ 12న అన్ని విద్యాసంస్థలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో కోవిడ్ మహమ్మారి ప్రబలకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వినోద్ కుమార్, యశ్వంత్ రెడ్డి, రఫీ, వెంకటరమణ నాయక్, తనూజ్ తదితరులు పాల్గొన్నారు

బీఆర్క్ ఫలితాల్లో 'నారాయణ' ప్రతిభ



ప్రతిభ చాటిన నారాయణ విద్యార్థులతో డీజీఎం కొండలరావు

తిరుపతి ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్ బీఆర్క్ పేపర్-2 పరీక్ష ఫలితాల్లో తిరుపతిలోని నారాయణ విద్యాసంస్థ విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఫలితాల్లో ఓపెన్ కేటగిరిలో ఎం.భానుచరణ్‌రెడ్డి 54వ ర్యాంకు (ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 3వ ర్యాంకు), శశాంక్‌రెడ్డి 58వ ర్యాంకు (ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 4వ ర్యాంకు), హిమేష్ రాఘవచంద్ర 59వ ర్యాంకు (ఓబీసీ కేటగిరిలో 11వ ర్యాంకు), విశాల్ చౌదరి 578, పునీత్ శేఖర్‌రెడ్డి 873 అత్యుత్తమ ర్యాంకులతో పాటు పలువురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ఆ విద్యాసంస్థ డీజీఎం కొండలరావు తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

–మున్సిపల్ కమిషనర్ మౌర్య ఆదేశం

తిరుపతి తుడా: వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. తిమ్మినాయుడుపాళెం పరిసర ప్రాంతాలను శుక్రవారం ఆమె అధికారులతో కలసి పరిశీలించారు. సీసీరోడ్లు, మురుగు కాలువ నిర్మాణం పనులపై దృష్టి సారించాలని, వీధి దీపాలు లేని ప్రాంతాలలో వెంటనే అమర్చాలని ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించండి

తిరుపతి నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు నిర్దేశిత గడువులోపు బూత్ లెవెల్ ఏజెంట్లను త్వరగా నియమించుకోవాలని తిరుపతి నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కమిషనర్ ఎన్ మౌర్య కోరారు. శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు. ఇప్పటి వరకు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులన్నీ పరిశీలించి వాటి వివరాలు అందుబాటులో ఉంచామన్నారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారు చేసేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ చెస్‌లో విద్యార్థుల ప్రతిభ



స్వర్ణ పతకాలు సాధించిన విద్యార్థులు



రజత పతకాలు సాధించిన విద్యార్థులు

తిరుపతి మంగళం : ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ శుక్రవారం నిర్వహించిన ఫస్ట్ ఆసియన్ ఆన్‌లైన్ చెస్ చాంపియన్‌షిప్‌లో మంగళంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలోని హోమ్‌టీమ్ విద్యార్థులు బంగారు పతకం కైవసం చేసుకున్నారు. హోమ్ సూపరింటెండెంట్ ఎన్.త్రినాథరావు మాట్లాడుతూ తిరుపతి సరోజినీదేవి రోడ్డులోని బాలికల గృహం విద్యార్థినులు రజత పతకాలు గెలుచుకున్నట్లు వెల్లడించారు. ఆన్‌లైన్ చెస్ పోటీల్లో ప్రపంచ వ్యాప్తంగా 19దేశాల బాలబాలికలు పాల్గొన్నారన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులు తిమ్మప్ప, మల్లికార్జునరావు, చెస్ కోచ్‌లు టి.సుధాకర్, సదాశివన్, సూపరింటెండెంట్‌లు ఎం.షణ్ముఖరావు, సి.నయోమి, రీజనల్ ఇన్‌స్పెక్టర్ పి.సుదర్శన్‌రెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ అధికారి బి.మోహన్ బాబు పాల్గొన్నారు.

ఎస్ఐకి డాక్టరేట్



శ్యామ్ సుందర్‌రెడ్డి

తిరుపతి సిటీ: ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ విభాగ పరిశోధక విద్యార్థి చింతపంటి శ్యామ్ సుందర్‌రెడ్డికి ఎస్వీయూ డాక్టరేట్ ప్రకటించింది. ఆయన కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ జి అంజన్‌బాబు, రిటైర్డ్ ప్రొఫెసర్ అంబటి రామమోహన్‌రెడ్డి పర్యవేక్షణలో 'సైబర్ సెక్యూరిటీ ఛాలెంజ్ ఆన్ ద డిజిటల్ అడ్వాంటేజ్ డ్యూరింగ్ కోవిడ్-19 పాండమిక్ ఏ ప్రిడెక్టివ్ అనలిస్టిక్స్' అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించారు. ఆయన ప్రస్తుతం వైఎస్సార్ కడప జిల్లా మైలవరం పీఎస్‌లో ఎస్ఐగా పనిచేస్తున్నారు.

జేమ్స్‌పై దాడి నిందితులను అరెస్ట్ చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

తిరుపతి కల్చరల్: దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని రాయలసీమ జిల్లాల డీవీఎంసీ సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం యూత్ హాస్టల్‌లో రాయలసీమ జిల్లాల విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. డీవీఎంసీ సభ్యులు పి.శ్రీనివాసులు, మునీంద్ర నాయక్, సరస్వతమ్మ, రాజ్‌కుమార్ మాట్లాడారు. జేమ్స్‌పై దాడి కేసు ఈనెల 16న నమోదు చేసినప్పటికీ నిందితులను ఇంత వరకు అరెస్ట్ చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. అట్రాసిటీ కేసుల విషయంలో పోలీస్ శాఖ చేస్తున్న జాప్యం మూలాన బాధితులకు న్యాయం జరగడం లేదని తెలిపారు. రాయలసీమలోని యూనివర్సిటీలను యూజీసీ కమిషన్ సందర్శించాలని పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీమ జిల్లాల డీవీఎంసీ సభ్యులు ఆరుద్ర శ్రీనివాస్, శేషాద్రి, కృష్ణమూర్తి, రామకృష్ణ, వరలక్ష్మి, గంగాధర్, చిరంజీవి, నాగలక్ష్మి, ఎల్లయ్య పాల్గొన్నారు.

25వ రోజుకు చేరిన సీహెచ్‌ఓల దీక్ష



సీహెచ్‌ఓల దీక్షకు సంఘీభావం ప్రకటిస్తున్న జిల్లా ఐద్వా కమిటీ

తిరుపతి తుడా: రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్తాఫీసర్ల (సీహెచ్‌ఓ) సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ సాయిలక్ష్మి డిమాండ్ చేశారు. 25 రోజులుగా డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం ఎదుట చేస్తున్న సీహెచ్‌ఓల దీక్షా శిబిరానికి ఐద్వా జిల్లా కార్యదర్శి, కమిటీ సభ్యులు శుక్రవారం సంఘీభావం ప్రకటించారు. ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చకుండా వారిని దగా చేస్తోందని దుయ్యబట్టారు. ఇకనైనా సీహెచ్‌ఓలను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి, ప్రమోషన్లు సైతం ఇవ్వాలని డిమాండ్ చేశారు.